# అడవి పూలు

చల్లని వాతావరణంలో భగ్గున మండుతున్నది నా చెంప. మనసు కుతకుత ఉడుకుతున్నది.

ఆశాభంగం—కాదు—అవమానం, కసి, ఉడుకుమోత్తనం ...

సోమి— దాని అందానికి, దాని ముఖానికి, నన్నిలా పరాభవిస్తుందా? నాలాంటివాడు దాన్ని కోరడమే మహద్భాగ్యం. పెద్ద పతివ్రతలాగ వేషాలు! అందరితోనూ పగలబడి, విరగబడి సరసాలాడుతుంది. నాతో మాత్రం? ఎన్నిసార్లు ఎలా కవ్వించింది?

రోజూ పాలూ, మజ్జిగా తెచ్చిచ్చేది. దాన్ని పెద్ద ప్రత్యేకంగా మే మెవ్వరం పట్టించుకునేవాళ్ళంకాదు. ఒక్క మధు మాత్రం ఏవో వేళాకోళాలు చేసేవాడు. సమంగా నవ్వుతూ సమాధానా లిచ్చేది.

ఆ రోజు అలవాటుగా పేపరూ, పెన్సిలూ చేత్తో పట్టుకుని నేను స్కెచ్ గీయటానికి అనువైన దృశ్యాలు వెతుక్కుంటూ బయలుదేరాను. నేనూ, మధూ, రాఘవా మొదటినుంచీ ప్రాణానికి ప్రాణంగా వుండేవాళ్ళం. హైస్కూలు చదువు ముగియగానే మా దారులు వేరయినా, మనసులు మాత్రం కలిసే వున్నాయి, రాఘవ హైస్కూలు వదలగానే—"ఎందుకొచ్చిన చదువురా ఈ బి. ఎ.లూ, ఎం. ఎ.లూ? ఏం ప్రయో

జనం? నాకు కావలసినంత సుక్షేత్రం ఉంది. స్వయంగా సాగు చేసుకుంటాను" అని ఈ ఊళ్ళో రైతుబిడ్డగా ఉండిపోయాడు. మధు ఎం.బి.బి.ఎస్. అయి పెద్ద డాక్టరై, పేరు ప్రఖ్యాతులను, కావలసినంత ధనాన్నీ కూడా సంపాదించాడు. నేను బి.ఏ.,బి.ఇడి. పాసై డ్రాయింగ్ మాష్టరుగా స్థిరపడ్డాను— నేనుకూడా చిత్రకారుల జాబితాలో ఎన్నదగిన వాడినేనని: అనే నా అభిమానులు కొంతమంది లేకపోలేదు.

రాఘవ తన పెళ్ళి స్థిరపడిందనీ, వెంటనే బయలుదేరి రమ్మనీ ఉత్తరాలు రాశాడు. వెధవ పల్లెటూరని మనసులో విసుక్కున్నా: నేనూ మధూ బయలుదేరి వచ్చాం. పెళ్ళి లక్షణంగా పల్లెటూరి ముచ్చట లన్నింటితో జరిగిపోయింది ఇక మేము బయలుదేరుతామన్నాము. అయినా రాఘవ మమ్మల్ని కదలనియ్యలేదు.

"పట్నం బాబులూ! పట్నంలో ఉండుండి జీవకళ లేకుండ తయారయ్యారు. కొన్నాళ్ళు మా ఊళ్ళోవుండి కాస్త ఒంటికి రక్తం పట్టించుకోండి. చిక్కని పాలూ, కమ్మని మజ్జిగా, వెన్నకాచిన నేయీ, ఈ ఊరి పొలిమేరలు దాటాక మీకు కలలోనైనా కనిపిస్తాయీ?" అని బలవంతంచేశాడు. వాడు వడ్డించిన పాలు పెరుగుల మీద ప్రలోభంతో కింటె వాడి బలవంతం వల్లనే మేం ఆగిపోవలసి వచ్చింది.

నాకా ఊరు కొత్త. నేను బయలుదేరుతూంటే రాఘవ "ఒక్కడివీ వెళ్ళగలవా?" అన్నాడు. వాడలా అనకపోయిఉంటే, నేనెవరినైనా తోడు తీసుకొనివెళ్ళి ఉండేవాడిని తీరా, వాడలా అనేసరికి 'ఏరా ఆడపిల్లననుకున్నావా?' అనే సమాధానం, అప్రయత్నంగానే, నా నోటివెంబడి వచ్చేసింది. రాఘవ పకపక నవ్వి "ఈ ఊళ్ళో ఆడపిల్లలు చాలా ధైర్యవంతులోయ్!" అన్నాడు. ఆ మాటలు నా పౌరుషాన్ని మరింత రెచ్చగొట్టగా, ఒక్కడినే బయలుదేరాను. మధు ఏదో నవల చదువుకుంటూ

ఇంట్లోనే పడుకున్నాడు. వాడెప్పుడూ అంతే! తగని బద్ధకం మనిషి. నవలలు! నవలలు!—ఇరవైనాలుగ్గంటలూ చదివి పారేస్తుంటాడు.

ముందర పొలాలకేసి నడిచాను. అక్కడ మగవాళ్ళూ,ఆడవాళ్ళూ చాలా మంది పనిచేస్తున్నారు. ఏదో పల్లెపదం కూడా పాడుతున్నారు. ఆ పదంలోని మాటలు కానీ, వాటి అర్థం కానీ ప్రయత్నించి తెలుసుకోలేక పోయాను. కానీ, "ఏ లే లో" అనే పల్లవి మాత్రం అందరూ కలిసి అందుకొని పాడడంచేత స్పష్టంగా వినిపిస్తూంది. క్రిందికి వంగుతూ, పైకి లేస్తూ, చకచక కదుల్తూ మసిలే ఆ పల్లె పడుచుల సహజ సౌందర్యం, మనసుకు గిలిగింతలు పెడుతూంటే, అలానే చూస్తూ ఉండిపోయాను.

వాళ్ళపాట ఆగిపోయింది. అందరూ గంపలు సర్దుకుంటున్నారు. బాగా చీకటి పడిందని అప్పటికిగానీ నాకు తెలియలేదు. అవన్నీ మెలికల మెలికల దారులు. ఇంటి దగ్గర నుంచి వెలుతురులో ఎలానో వచ్చేశాను. కానీ, ఇప్పుడెలా వెళ్ళాలో సరిగా తెలియడం లేదు. నా జ్ఞాపకశక్తినంతా ఉపయోగించి దారులు మళ్ళుతున్నాను. వచ్చేటప్పుడు పదిహేను నిమిషాల కంటె ఎక్కువ నడిచినట్లు జ్ఞాపకంలేదు. నా చేతిగడియారం, నేను ముప్పావుగంటపైగా నడిచినట్లు చెబుతూంది. ఇంత వరకూ, కనుచూపు మేరలో కూడా ఇళ్ళు కనపడడం లేదు. వెన్నెల విరుస్తూనే ఉంది. కానీ, చుట్టూ దట్టంగా చెట్లు ఉండడం వల్ల వెన్నెల కాంతి చీకట్లతో దోబూచులాడుతూంది. ఇంతలో నా కాలికేదో గట్టిగా తలిగింది. తల వంచి చూశాను. పుర్రె, గుండె గుభిల్లుమంది—భయంతో, ఆందోళనతో చుట్టూ కలయజూశాను. సందేహంలేదు. అది శ్మశానమే. నాలో రక్త ప్రసారం నిలిచినట్లయింది. కాళ్ళూ, చేతులూ అప్రయత్నంగానే వణక సాగాయి. నేను పిరికివాడినని నవ్వకండి. పగలు నలుగురి మధ్యా నిల బడి బయలుదేరుతున్న శవాన్ని చూడగలగడం వేరు; రాత్రివేళ శ్మశా

నంలో ఒంటరిగా నిలబడవలసిరావడం వేరు. ఏదో భయం. ఇదమిత్థ మనరాని: ఆందోళన మిన్ను విరిగి మీదపడబోతున్నట్టు భావన.

నిజానికి అక్కడ ఏ చెట్టు క్రిందో కూర్చుని రాత్రంతా గడిపినా, జరిగే ప్రమాదమేమీ ఉండదని నేనూ చెప్పగలను కానీ రాత్రి సమయా నికి, మానవుల భయాలకూ అనుబంధమేమోకానీ, రాత్రి కాలంలో అవి త్రిగుణీకృతమవుతాయి. "ఛ! అంతా హంబక్" అని నవ్వుతూ కొట్టి పారవేసిన దయ్యాల కథలు మూలమూలవీ ఆ క్షణంలో గుర్తుకు రావడం నా జ్ఞాపకశక్తిని చాటుతుందో, నా బలహీనతను చాటుతుందో చెప్పలేను. ఏమైనా, ఇక ఆ దారిలో ఒక్క అడుగుకూడా ముందుకు వెయ్యలేము. గిరుక్కున వెనక్కు తిరిగాను. అది శ్మశానమని గుర్తించి నప్పటినుండీ నాకా ప్రాంతాలలో అంతా ఉండుండి చిన్న చిన్న మంటలు కనపడసాగాయి. ఎవరో కదులుతున్నట్లు భావన—ఏవో వింత ధ్వనులు. అడుగులు త్వరగా వేస్తున్నాను. మళ్ళీ ఎటు పోతున్నానో అర్థం కావడం లేదు. ఒకదాని వెనుక ఒకటి జ్ఞాపకానికి వస్తున్న దయ్యాలు కథలు నుదురు వేడెక్కిస్తున్నాయి. అంతలో నల్లగా జుట్టు విరబోసుకుని చేతిలో కుండ పట్టుకుని పెద్ద పెద్ద అడుగులతో నావైపే వస్తూంది. కెవ్వున కేక పెట్టి క్రింద పడిపోయాను. తర్వాత ఏం జరిగిందో నాకు తెలియదు. నేను కళ్లు విప్పి చూసేసరికి ఆ నల్లని ఆకారం నామీదికి వంగుని ఉంది. మళ్ళీ కెవ్వుమన్నాను.

"నాను బాబూ! సోమిని—అట్టా జడుసుకు పోనారేంటి దొరా?" అంటూంది సోమి, తన చల్లటి చేత్తో మరిగిపోతున్న నా నుదుటిని రాస్తూ.

ఆ మాటలు విని సోమివంక విదానించి చూశాను: దాన్ని గుర్తిం చాను. ఏం జరిగిందోకూడా అర్థమయింది. సిగ్గువేసింది. నవ్వు వచ్చింది.

సోమి, తన నల్లటి ముఖంలో తెల్లనిపళ్లు కనపడేలో నవ్వుతూ "అదేటి బాబూ! నన్ను సూత్తానే కాకేసి పడిపోనావు. నాను లగెత్తు కెల్లి మా మల్లన్న మావఁను కాకేసినాను. ఇద్దరవీఁడకి దెచ్చినాం. నాను జడిపించేలాగున్నానా బాబూ!" అని నవ్వుతూంది. నేను భగ భగ మండు తున్న కళ్ళతో దానివంక చూశాను. బుడ్డి దీపం వెలుతురులో సోమి నల్లని శరీరం మిసమిసలాడుతూంది. గుండ్రని ముఖంలో కోలకళ్లు నీళ్ళల్లో ఎగిరెగిరిపడే చేప పిల్లల్లా మిల మిల లాడుతున్నాయి. నవ్వుతూ పలకరిస్తున్నట్లున్నాయి. అవి, పల్లెపడుచుల అంగసౌష్ఠవాన్ని గురించి నేనేమీ చెప్పనక్కరలేదు. అందరికీ తెలుసు. వాళ్ళ శరీరాలు శిల్పులకు ఆదర్శాలని. సోమిది జడిపించే ఆకారంకాదు. ఝల్లుమనిపించే ఆకారం. అయినా నేను జడుసుకున్నాను. కాదు—విపరీత భావనా నిమగ్నమైన నా మనసు నన్ను జడిపించింది.

"శ్మశానంలోకి నువ్వెందుకొచ్చావు సోమీ?" అన్నాను, నా భయానికి వ్యాఖ్యానం చెప్పుకు నేలాగ.

సోమి ఆశ్చర్యం ఆ గుడ్డి వెలుతురులో కూడా నాకు స్పష్టంగా కనిపించింది.

"నాను స్మసానం రావటమేటి బాబూ! నాను చెరువు కెళ్తొస్తు న్నాను. తమరుగాని స్మసాన వెఁళ్లారేటి? దారి తప్పి స్మసానానికెల్లి ఎనక్కు మల్లి నన్ను చూసి జడుసుకున్నారా?"

సోమి నవ్వుతూంది నాకు చాలా సిగ్గనిపించింది. సోమి ఓదారు స్తున్నట్టుగా "ఎంతైనా కొత్తలేబాబూ! తోడు దీసుకు రావలసింది. అల వాటయిపోయిన మాకే ఆడ గుండె గుభిల్లుమంటాది. మీకు కూసింత భయం గలుగుతదిలే బాబూ!" అంది.

భయంపోయినా, భయం తాలూకు జ్వరంమాత్రం ఇంకా పోలేదు. క్రిందపడినప్పుడు తలకు దెబ్బతగిలి ఉండాలి. తెగమండుతూంది. ఏదో పట్టీలాంటిది తగిలింది. సోమి నా అవస్థను గమనించిన దానిలా జాలిగా "కదలకుండడుకో బాబూ! తలకు సిన్న దెబ్బ తగిలినాది. మా మావ పట్టీ ఏశాడు. ఆడికీ మూలికల వైద్దియం బాగ తెలుసునుబాబూ. నాకు కూడా ఆడికాడ వాత నేర్చుకున్నాను. ఈడ అందరికీదే వైద్దియం సేస్తాడు. ఇది కూస్త నోట్లో ఏసుకోబాబూ!" అంటూ, ఏదో ఉండ లాంటిది నా నోట్లో వెయ్యబోయింది. నేను చికాకుగా వద్దన్నట్లు తల తిప్పాను.

"నా మాటిను బాబూ! ఆడి వైద్దియంవల్లే నీకింత బేగి తెలివొచ్చి నాది, ఆడొకటేసి, నన్నిదెయ్యమని సెప్పెల్లినాడు. ఏస్కొంటివా, తెల్లారేపాటికి జరమంతా దిగిపోతాది. ఒద్దంటివా, ఈ జరం పదారు రోజు లుంటాది" అంది.

ఈ పల్లెవాళ్ళు మూలికలతోనే అద్భుతమైన వైద్యం చేయగల రని విన్నాను. కానీ, ప్రత్యక్షంగా అనుభవించవలసివస్తే కష్టంగానే ఉంది. నే ననుభవిస్తున్న వ్యధనుబట్టి జ్వరం తీవ్రంగానే ఉండవచ్చు ననుకున్నాను. సోమి నా నోట్లో ఉండలేసి ఇన్ని నీళ్ళు పోసింది. చేదుగా, వగరుగా ఉంది. ఎక్కడినుండో పదకొండు గంటలు కొట్టడం వినిపించింది. ఇంకా పదకొండేనా? సుదీర్ఘమనిపించే ఈ రాత్రి ఇంకా ఎప్పటికి ముగుస్తుందో!

నా అనేవారు దగ్గరలేక, ఊరుకాని ఊళ్లో అలా జ్వరంతో పడి ఉండడంకన్న దురదృష్టం ఉండదు సాధారణంగా.

కానీ ఆనాడు సోమి, అనురాగవతి ఐన భార్యకన్నా, అభిమా నించే సోదరికన్నా, వాత్సల్య పూర్ణఅయిన కూతురికన్నా మిన్నగా అంద

అయింది నేను ఏ కాస్త మూలిగినా, వెంటనే పలికేది. "అబ్బా!" అను కుంటే, దగ్గర కూర్చుని తలరాసేది. సుదీర్ఘమనిపించిన ఆ రాత్రి క్షణంలో కరిగిపోయినట్లనిపించింది. అంతేకాదు—నా జీవితంలో చిర స్మరణీయమైన, అత్యంత మధురమైన రాత్రి అదేనని అనుకున్నానేమో కూడా!

సోమి భరోసా ఇచ్చినట్లుగానే, మరునాటికల్లా జ్వరం నయ మయిపోయింది.

రాత్రి నేను రానందున రాఘవ, మధు చాల కంగారు పడ్డారట. రాఘవ తన పాలేళ్ళనందరినీ వెతకడానికి పంపాడట. ఎక్కడా కనపడ లేదని వినేసరికి వాళ్ళకు మతులు పోయాయట. చివరికి తెల్లవారిన తర్వాత మల్లన్న వెళ్ళి జరిగింది చెప్పాక వాళ్ళిద్దరూ వచ్చారు. ఎద్దు బండిలో రాఘవ నన్ను వాళ్ళింటికి తీసుకుపోయాడు. మధు నన్ను పరీ క్షించి, గాయం పెద్దదేననీ, ఆ వేసిన పట్టీ ఏమోగాని, చాలా చక్కగా గాయాన్ని తొందరగా మాన్పిందనీ అన్నాడు.

ఆ నాటినుంచి సోమి నా మనసులో తిష్ఠ వేసుకుపోయింది. అంతకుముందు యధాలాపంగా వెళ్లేవాడిని ఇప్పుడు పని కట్టుకుని పొలాల కేసి వెళ్ళసాగాను. నన్ను చూస్తూనే సోమి నవ్వుతూ పలకరించేది.

"చీకటడకుండానే ఎల్లిపొండి బాబూ!'' అనేది నవ్వుతూ.

నేనుకూడా నవ్వుతూ "ఫరవాలేదులే! నువ్వున్నావుగా అనేవాడిని.

"అట్టయితే నాకు సూస్తుండగనే అడిపోండి—అట్టగాకుంటె వానొచ్చేదెట్టా?" అనేది.

ఈ హాస పరిహాసాలు నాలో ఆమె పట్లగల కోరికను మరింత విజృంభింపచేశాయి. సోమిని శాశ్వతంగా నాదానిని చేసుకోవాలనే ఆలోచన

నా కెన్నడూలేదు. నాలాంటివాడు రమ్మనంగానే వస్తుంది. కాకపోతే కాస్త డబ్బుపారేస్తే అదే వస్తుంది. అసలు నేను పిలవడమే ఆలస్యం అనుకునే వాడిని. రెండురోజులు పరిశీలన తర్వాత సోమి రాత్రి ఎనిమిది, తొమ్మిది గంటలకు పనంతా అయ్యాక చెరువుకువెళ్ళి స్నానంచేసి, ఒకర్తే నీళ్లు మోసుకు వస్తుందని గ్రహించాను. దారి కాచాను. అథాట్టుగా వెళ్లి చెయ్యి పట్టుకుని నా మీదకు లాక్కున్నాను. దాని నెత్తిమీద కుండ క్రిందపడి ముక్కలయి నీళ్ళు ఇద్దరిమీదా చిందాయి. సోమి పెనగులాడుతూ "ఇదేటి బాబూ! ఒదులు" అంటూంది.

"నా మాటవిను సోమీ!" అన్నాను ప్రాధేయ పూర్వకంగా.

"ఒదులు బాబూ! నాకు మా మల్లన్న మావతో మనువు కుదిరి పోనాది. నీతోకాదు" అంది సోమి బలంగా నా కౌగిలి విడిపించుకొని.

"నువ్వు మీ మల్లన్న మావనే చేసుకో! వద్దన్నదెవరు?" అన్నాను వగరుస్తూ.

సోమి తెల్లబోయి నావంక చూసింది.

"ఇదేటి బాబూ!" అంది అయోమయంగా.

"నా కోరిక తీర్చు సోమీ! నీకెంత కావాలన్నా ఇస్తాను" అంటూ జేబులో చెయ్యి పెట్టాను.

నా మాటలు పూర్తి కానేలేదు. సోమి బలమైన చెయ్యి నా చెంపకు చెళ్ళున తగిలింది. సోమిని పట్టుకున్న నా చెయ్యి అప్రయత్నంగా వీడి పోయి నా చెంపను తడుముకుంది. సోమి రివ్వున అక్కడినుండి పారి పోయింది. తగిలిన దెబ్బకన్న కలిగిన అవమానం కుతకుతలాడిస్తూంది. సోమి చేతినున్న వెండి ఉంగరాల రేఖలు నా చెక్కిలిమీద నిలిచాయి.

నన్ను చూడంగానే మధు "ఇదేమిటిరా?" అన్నాడు. అప్పటికే పగం గ్రహించి.

నేను చెప్పకపోయినా వాడు గ్రహించగలడు. అదీగాక, మామా గొప్పలు మాత్రం చెప్పుకుని, బలహీనతలు దాచుకునే స్థాయిలోని స్నేహంకాదు మాది. ఈ రెండు రోజులుగా నా విరహాన్ని వాడిముందే వెళ్ళబోసుకుంటున్నాను అందుకని జరిగింది వివరించాను. వాడు మొదట లీలగా నవ్వాడు. నాకు ఉడుకుమోత్తనం వచ్చింది.

"నవ్వరా, నవ్వు! ఈ అవమానం నాకు జరిగితే ఒకటీ, నీకు జరిగితే ఒకటీనా? ఎలాగైనా ప్రతీకారం చెయ్యాలని ఆలోచించక...."

మధు నా మాటలకు మధ్యలో అడ్డుతగిలి "నవ్వక ఏడవమంటావురా? ఒక కూలిదాన్ని లొంగదీసుకోవడం కూడా చేతకాక, అవమానమంటూ. నాదగ్గరేడుస్తే, నీ చేతకానితనానికి నన్నూ జోడు కలవమంటావా?" అన్నాడు.

నా మనసు కలుక్కుమంది. అందుకు కారణం మధు నా రసికత్వాన్ని కించపరచడం మాత్రమేకాదు. సోమిని కించపరిచి మాట్లాడడం నాకే విచిత్రమనిపించింది. ఇంత క్రితం క్షణం వరకూ, సోమిమీద కసితో భగభగలాడుతున్న నా మనసు, అది చాలా తేలిక రకమని భావించిన నా మనసు, మధు దాన్ని గురించి తేలికగా మాట్లాడేసరికి ఎందుకిలా కిలకబారిందో అర్థంకాదు.

"పెద్ద నవ్వుతున్నావ్! నువ్వు లొంగదియ్యి చూద్దాం!" సవాల్ చేస్తున్నట్లు అన్నాను

మా మధు "యువజన నారీ మన్మధుడు"గా ప్రసిద్ధి గాంచినవాడు. డాక్టర్‌గా వాడికున్న ప్రాక్టీసు, పెరుగుతున్న బాంక్ ఎక్కౌంటూ, వేరే ప్రత్యేకాకర్షణలు. ప్రస్తుతం మా మధుకోసం ఎంతమంది కన్యలు తపస్సు చేస్తున్నారో నాకు తెలుసు.

మధు నిరసనగా నవ్వి "నా కదెందుకోయ్?" అన్నాడు.

నేను వాడిని మరింత కవ్విస్తూ "కావాలన్నా నీతరం కాదులే!'' అన్నాను.

వాడు రెచ్చిపోయాడు. "సరే! రెండు రోజులు చాలు. నేను ముందు నీదగ్గరకు వస్తే సోమి నా వెనకాల పరుగెత్తుకు వస్తుంది" అన్నాడు.

ఆ రాత్రే బయలుదేరుదామనుకున్న మేము మా ప్రయాణాన్ని రెండు రోజులు వాయిదా వేశాము. దీనికి కారణం రాఘవకు కూడా తెలుసు. వాడు నవ్వి "సరే! మీ ప్రయోగాలు కానివ్వండి. ఫలితం తెలిశాక నా చెవిని కూడా వెయ్యండి" అన్నాడు.

ఆ మరునాడు సాయంత్రం మధు చాలా హుషారుగా ఈల వేసుకుంటూ వచ్చాడు. నా గుండె గుబగుబలాడింది.

కుతూహలంగా "ఏంరా! సంగతేమిటి? సోమి వీధి గుమ్మంలో ఉందా?" అన్నాను.

వాడునవ్వి "తొందర పడకురా! ఇంకా ఉంది. రేపటిదాకా నాకు గడువిచ్చావుగా!'' అన్నాడు.

నా మనసు కొంత శాంతించింది. ఆ తర్వాత రోజు మధు కుంటుకుంటూ వచ్చాడు. ముఖం చాలా వడిలిపోయి ఉంది నేను కంగారుగా "ఏం మధూ. ఏం జరిగింది?'' అన్నాను.

"కాలుమీద మండ్రకప్ప కరిచిందిరా!'' అన్నాడు మధు మెల్లగా.

నేను కంగారుగా "అరె! ఏదైనా మందు, మంత్రం, ఇంజక్షన్" అన్నాను.

మధు నవ్వి "ఏం అక్కర్లేదురా! సోమి ఏదో ఆకుపసరు పిండి కట్టు కట్టింది. బాధ తగ్గిపోయింది. కొంచెం నొప్పిగా ఉందంతే!'' అన్నాడు. నా ముఖం తెల తెల పోయింది.

"అయితే నువ్వు జయించావన్నమాట!" అన్నాను.

లేదురా! నీ సవాల్‌కు ఓడిపోయాను. కానీ, సోమి ముందు. ఈ గెలుపు ఓటముల ప్రసక్తే లేదు. నేనివాళ ఒక సర్వకాలిక సర్వజనీన నగ్నసత్యాన్ని తెలుసుకున్నాను.''

నేను మధు దగ్గరగా జరిగాను.

"మధూ! కథ చెపుతావా?"

"చిన్నది."

"తొందరగా కానియ్యి. ఇవాళ రాత్రి ట్రెయిన్‌లో పోదాం."

"సరే! ఇలా బడుద్దాయిలా కూర్చోక. మన సామాన్లు సర్దుతూ విను. నేను నిన్నంతా సోమి పని చేసుకుంటూంటే, ఆ చుట్టుప్రక్కలే తిరుగుతూ దాన్ని ఏవేవో వేళాకోళాలాడుతున్నాను. అది కూడా నవ్వుతూ త్రుళ్ళుతూ సమాధానాలిచ్చింది. ఒక్క నాతోనే కాదు, పొలంలో ప్రతి వాళ్ళతో ఆడా మొగా తేడా లేకుండా వేళాకోళా లాడ్డమే దాని పని. అది నవ్వుతుంది; అందరినీ నవ్విస్తుంది. ఈ ధోరణి చూస్తే నాపని చాలా తేలికనిపించింది.

ఇక్కడ సోమమ్మ గుడి అని ఉందిలే! రాఘవ ఏదో మాటల మీద చెప్పాడు. పెద్దగా పూజా పునస్కారాలేవీ ఉండవట కానీ, ఎప్పుడైనా ఇక్కడివాళ్ళు వెళ్ళి సోమమ్మ దేవతను చూసి వస్తుంటారట. ఊరికి రెండు ఫర్లాంగుల దూరంలో ఇంచుమించు అడవిలాంటి ప్రదేశంలో ఉంది అది.

"ఇవాళ సాయంత్రం నేను సోమిని నాకు సోమమ్మ గుడి చూడాలని ఉంది. నాకీ వూరు క్రొత్త చూపిస్తావా!" అన్నాను.

"ఓ ఎల్దారి. నాను గూడా ఆయమ్మకి పసుపూ కుంకం ఇద్దారనుకుంటున్నా! పదండి" అని దారి తీసింది.

నడుస్తూ "ఆయమ్మ కేటని మొక్కుతారు బాబూ! మంచి పెళ్ళాం దొరకాలనా ?" అంది.

సోమే అందించింది. నేను హుషారుగా ఈలవేశాను.

"మరే! నీలాంటి భార్య దొరకాలని!"

సోమి తన పెద్ద కళ్ళను మరికాస్త పెద్దవిచేసింది.

"నాలాటిదా బాబూ! తమరు సదువుకున్నోరు. సదూకున్న సక్కని సుక్కను పెళ్ళాడతావు. మేమేటి?! మట్టిలో మనుసులం!"

"మాణిక్యానివి నువ్వు! ఇంత అందం ఎక్కడా చూడలేదు."

సోమి సిగ్గుపడింది. నల్లని దాని చెక్కిళ్ళలో ఎర్రదనం స్ఫుటంగా కనపడలేదుగాని, దాని కళ్ళు వింతగా మెరిసి నా ఒళ్ళు పులకరించేలాగ చేసింది. అప్పటికి నాకు పంతానికి కాక నిజంగానే దానిమీద కాంక్ష తీవ్రమయింది.

"మా మల్లన్న మావ ఇట్టాగే అంటాడు బాబూ!" నెమ్మదిగా అంది.

మల్లన్నేమిటి సోమీ! నిన్ను చూసిన ఏ మొగాడైనా అట్లాగే అంటాడు అన్నాను.

ఈ మాటలంటుండగా నాగొంతు వణికింది. సోమి తలెత్తి చిత్రంగా, భయంగాచూసింది.

నా సరసనే నడుస్తున్న దాని సన్నని నడుము చుట్టూ చెయ్యేసి విడిపించుకోడానికి వీల్లేనంత బలంగా నా గుండెల కదుముకున్నాను.

మీరూ ఇంతేనేటి బాబూ! ఈ సదూకున్నోరంతా...."

ఏమిటేమిటో అంటూంది. దాని మాటలు నాకు వినపడటం లేదు. ఇంకా, ఇంకా దగ్గిరకు ఒత్తుకుంటున్నాను. ఊపిరాడనియ్యకుండా ముద్దు

పెట్టుకుంటున్నాను. సోమి చాలా బలమైనది. దాన్ని నా కౌగిలిలో ఉంచు కోవడానికి నేను చాలా శ్రమ పడవలసి వచ్చింది. ఇంతలో సినిమాల్లో పతాక సన్నివేశంలో ప్రతి నాయకుడిని పాము కరిచినట్లు, ఒక పెద్ద మండ్రకప్ప అతిప్రేమతో నా కాలిని గాఢంగా ముద్దుపెట్టుకుంది. దాని ప్రేమ ముందు నా ప్రేమను త్యాగం చేసి బాధగా అరుస్తూ కూలబడ్డాను. సోమి గబగబ ఒక పెద్ద రాయినెత్తి దాన్ని చంపేసింది. పరుగున పోయి పొదల మధ్య వెతికి ఏదో ఆకుతెచ్చి పసరు గాయంమీద పిండి, తన చీరకొంగు చింపి కట్టు కట్టింది. విపరీతమైన వేదన కలిగిస్తున్న నా గాయం ఆ పసరుతో కొంత ఉపశమించింది.

"తగ్గిపోతదిలే బాబూ! ఎట్టయినా ఇంకో అరగంట దాకా నడవ లేవు. పోన్లే! ఎనక్కి పోదారి! నువ్వు సోమమ్మని సూట్టానికి రాలేదు గదా!" అంది.

నేను దాని ముఖంలోకి చూశాను. అది ఏడుస్తూందని అప్పటికి గాని నాకు తెలియలేదు. నా మనసులో పశ్చాత్తాపం లాంటిదేదో కలిగింది.

"ఏడుస్తున్నావా?'' అన్నాను.

"ఏటో బాబు! మొన్ననా ప్రకాసం బాబూ ఇంతే! మా కిట్టం టియి లవ్వు. పగలంతా కట్టం సేస్తాము. మా కట్టం తెలియకుండా వూసులాడుకుని పదాలు పాడుకుంటాం. మీకేటో, ఆడదంటే ఇలువలేదు" అంది.

నన్నెవరో కొరడాతో కొట్టినట్లయింది. మన కాడదంటే విలువ లేదట! నిజమా?

"ప్రకాశం సంగతేమిటి?" అన్నాను దాని నోటి వెంబడి విందామని

"ఆరూ ఇంతే బాబూ! జడుసుకుని జ్వరం తెచ్చుకున్నాడు మారాజు. మా మల్లన్న మావ మందిచ్చిండు. ఇస్వాసంతో నన్నాయన

కాడుంచి ఎల్లిపోనాడు. తోడబుట్టినోడికి లాగా, రేతిరంతా కాసినాను. ఈటో ఆరికేం తెలవదు. ఆరిని కాసుకున్న మల్లన్న మావ(కే అన్నాయం సేయబొయ్యాడు. ఆడి మంచితనం ఈరికి సేతకాని తనవ(యినాది. ఒద్దన్నా ఇనిపించుకోనేదు. నా చేతులడిపోను! ఈ చేతులతోనే ఆరికి చెంపదెబ్బ తినిపించినాను. మీరూ అట్లాగే సేస్తన్నారు. ఆ మంద్రకప్ప కాజేయకుంటే మరోచనానికి నా వూపిరోయుండేది..."

నాకు సిగ్గుతో తల వాలిపోయింది. సోమి చెప్పిన మాటల్లో అబద్ధం అణుమాత్రమైనా లేదనిపించింది. నా చేతుల్లో ఇంకో రెండు క్షణాలు బంధింపబడి ఉంటే దాని ప్రాణంపోయి ఉండేదేమో? ఆ సమయంలో అక్కడ నేనూ, సోమీ తప్ప ఇంకెవరూ లేరు. ఈ సంగతి ఎవరికీ తెలియదు కూడా! అయినా, అక్కడి ప్రకృతి యావత్తు నన్ను నిలదీసి ప్రశ్నించినట్లు అనుభూతి కలిగింది.

"నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను సోమీ!" అన్నాను మనసారా!

"అదెట్టా బాబూ! నాకు మనువు కుదిరిపోనాదని సెప్పినాంగద!"

"సూర్యుడు పశ్చిమాన ఎలా ఉదయిస్తాడు?" అన్నట్లుగా ఉంది దాని ప్రశ్న.

"నేను బాగుండనా సోమీ!"

"ఇంత సక్కని మారాజుని ఏడా సూడలేదు నేను."

"నేను ..నేను...డాక్టర్ని తెలుసా?"

"ఇన్నాను బాబూ! తమరు సానా డబ్బుగలవోరంట! మీ ఇంగిలీసు వైద్దియానికి డబ్బు సానా వస్తాది బాబూ! మా మావ(ఈడందరికీ వైద్దియం సేస్తాడు. అందరికీ కుదురుతాది. పైసారాదు. అవుతేనేంలే బాబూ! అందరికీ ఆడంటే పేనం. ఎంతెంత దూరం నుంచయినా ఆడి

కోసం వస్తుంటారు. పగలంతా కూలిసేత్తాడు. ఆమీన ఆల్లకీ, ఈల్లకీ మందులిత్తాడు. అసలు మాలాటి కూలినాలి సేసుకునేవోల్లకే వంన్ని రోగాలు రావులే!"

"మరి, నన్నెందుకు చేసుకోనంటావు సోమీ!"

సోమి విరగబడి నవ్వింది.

"నువ్వు చెప్పేది మరీ బాగుంది బాబూ! నీకంటే సక్కనోడు, నీకంటె డబ్బునోడు కంటబడితే ఆడెంట తగిలేదా?"

చెళ్ళున చరిచినట్లయింది.

"మీలో మారు మనువులున్నాయా?" అన్నాను.

"ఉన్నాయి బాబూ! తగాదాలొత్తే, సరిపడకపోతే. ఇడిపోతాం. ఇప్పుడా వూసెందుకు దొరా!"

ఇంక నాకు మాటలు దొరకలేదు. సోమి నవ్వుతూ నన్ను చెయ్యి పుచ్చుకుని లేవదీసి ఊళ్ళోకి నడిపించుకుంటూ వచ్చింది.

మధు ఆగిపొయ్యాడు. నేను సామానులు సర్దటంకూడా మరిచిపోయి, వాడి మాటలు వింటున్నాను. ఏమిటీసోమి? నేను మా మావను ప్రేమించాను, వాడికోసం ఏ త్యాగమైనా చేస్తాను. ఇలాంటి మాటలు మాట్లాడివుంటే మాకు తేలికగా అర్థమయి ఉండేది. కానీ, ఇలాంటి మాటలు ఉంటాయనికూడా దానికి తెలియదు. మధు చెప్పింది నిజం! సోమి ఒక సర్వజననీ సర్వకాలిక నగ్న సత్యానికి రూపకల్పన చేసింది— చదువులకూ, హోదాలకూ, మన్ననలకూ. మర్యాదలకూ అతీతమయి సృష్ట్యాదినుంచి ఈనాటివరకు అనంతంగా ప్రకాశించే సహజ నిర్మల మానవ విశ్వరూపాన్ని మాకు ప్రదర్శించింది.

ఈ అనుభవాలలో మేము పోగొట్టుకున్న దేమీలేదు: పొందిందే చాలా వుంది.

"ఇదేమిటర్రా! ఇవాళకూడా ప్రయాణం సాగడంలేదా?" అని రాఘవ వచ్చేసరికి మేం ఉలిక్కిపడి ఆలోచనలోంచి తేరుకున్నాం. వాడికికూడా జరిగింది చెప్పాం.

వాడు నవ్వుతూ "ఇలా జరుగుతుందని నాకు తెలుసు, మీరే తెలుసుకోవాలని నేను చెప్పలేదు" అన్నాడు.

నేను తొందరగా మా సామాన్లు సర్దడానికి ప్రయత్నిస్తుంటే రాఘవ ఆపి "లాభంలేదు. బండి అందదు. పైగా మధు కాలుకూడాఇంకా కొంచెం బాధపెడుతూనే ఉంది. రేపు వెళ్ళండి" అన్నాడు.

ఆ మరునాడు పదిగంటలకు నేను, మధు ఎక్కిన రైలు రాఘవ వీడ్కోలు చెబుతుండగా కదిలింది. కిటికీలోనుంచి కనిపించే పంట చేలను ఇద్దరం అప్యాయంగా చూస్తున్నాం. విరగపూసిన అడవిపూలు ఆ ప్రదేశానికొక వింత అందాన్ని కలిగిస్తున్నాయి. తీరువలేనట్లు కని పించే ఆ పూలల్లో ఎంత అందం? మత్తెక్కించే సువాసన వాటికిలేని మాట నిజమే. కానీ పంటగాలులు మోసుకువచ్చే వాటి మెత్తని వాసన ఎంత హృదయాహ్లాదకరంగా ఉందీ? ఎందుకో వాటిని చూస్తుంటే సోమి గుర్తుకు వస్తుంది. అవీ సోమీకూడా నీ విజ్ఞానానికీ అందని సృష్టి సౌందర్య సహజ తత్త్వానికి ప్రతిబింబాలయినట్లు తోచింది.

———